క్లుప్తంగా

168 హెక్టార్లలో పంట నష్టం

ఉయ్యాలవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వారం రోజులు కురిసిన భారీ వర్షాలకు మండలంలో 168 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రాథమికంగా మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల్లో వరి 93 హెక్టార్లు,, కంది 27, మొక్కజొన్న 43, పత్తి 5 హెక్టార్లలో వర్షపు నీరు నిలిచి దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

డిగ్రీ ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తుల ను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి గురువారం తెలిపారు. ఈ నెల 26 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఎస్సీలు రూ. 200, బీసీలు రూ.300, ఇతరులు రూ. 400 ఫీజు చెల్లించాలన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాంలలో కంప్యూటర్, జువాలజీ, హిస్టరీ, కెమిస్ట్రీ కోర్సులున్నాయన్నారు. దసరా సెలవులు అనంతరం 6వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

రోటరీ క్లబ్ సహకారం మరువలేనిది



వీల్‌చైర్లు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వాసుపత్రికి రోటరీ క్లబ్ అందించిన సహకారం మరువలేనిదని నంద్యాల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. గురువారం వీల్‌చైర్లను రోటరీ క్లబ్ పీడీజీ కందుకూరి శ్రీరామమూర్తి సహకారంతో రోటరీ అధ్యక్షుడు, న్యాయవాది ముక్కమల్ల వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ఆసుపత్రికి వీల్‌చైర్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ సభ్యులు బాలకృష్ణ, మోహన్‌రెడ్డి, భూషణం, ఖండే హరినాథ్ పాల్గొన్నారు.

పశు వైద్య సేవలు సకాలంలో అందించాలి



జిల్లా పశు సంవర్థక శాఖ అధికారికి పూల బొకే అందజేస్తున్న దృశ్యం

రుద్రవరం: రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి గోవింద నాయక్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం ఆయన ఆళ్లగడ్డ డీడీ రమణయ్య, సాంకేతిక సహాయ సంచాలకులు సునిల్ కెన్నెత్ పాల్, ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు సుభాన్‌బాషా, ఎర్రగుడిదిన్నె పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో పెయ్య దూడల లింగ నిర్ధారణ ఎద సూదులను ఖచ్చితంగా వేయాలని చెప్పారు.

బంగారు కుటుంబాల దత్తతను వేగవంతం చేయండి

నంద్యాల: బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి సాంకేతిక సమాచార కార్యకలాపాలపై మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 50,035 మంది బంగారు కుటుంబాలు నమోదు కాగా, అందులో 33,631 కుటుంబాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా మిగిలిన 16,404 కుటుంబాలను తక్షణమే మార్గదర్శకులతో అనుసంధానం చేయాలన్నారు. ఇకపై అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని, ఏ అధికారి వద్దా పెండింగ్ ఉండరాదని ఆదేశించారు.


చాపిరేవులలో చోరీ

నంద్యాల(అర్బన్): చాపిరేవుల గ్రామానికి చెందిన దూదేకుల బాలుడు ఇంట్లో ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. బాలుడు చిన్న కూతురును ఇంటి వద్ద ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బాలికను మభ్యపెట్టి ఇంట్లోకి ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఈఈల బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీఎస్‌పీడీసీఎల్ కర్నూలు కార్యాలయంలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాధ్యతలు చేపట్టారు.కర్నూలు సర్కిల్ కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్ ఈఈగా పని చేస్తున్న వైవీ మహేశ్వరరెడ్డి టెక్నికల్ ఈఈగా నియమితులయ్యారు.అలాగే అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో డీఈఈగా పనిచేస్తున్న ఎం.భాస్కర్‌రావుకు ఈఈగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. వీరిద్దరూ గురువారం బాధ్యతలు చేపట్టారు.

అన్నపూర్ణదేవీ నమోస్తుతే!



రుద్రవరంలో ధనలక్ష్మిగా వాసవీమాత





బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవి, కూష్మాండదేవిలుగా గంగాదేవి, కామేశ్వరిమాత, జగజ్జననీ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

జగన్మాతా.. శరణు.. శరణు..



బాలత్రిపురసుందరీదేవీగా అమ్మవారు

డోర్నిపాడు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం డోర్నిపాడులో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కమిటీ అధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు భోజన వసతి ఎర్పాటు చేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు, ఉభయదారులు



బొమ్మలసత్రం షిర్డిసాయిబాబా లయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని నాల్గవ రోజు గురువారం పలు దేవాలయాల్లో ఉదయం నుంచి లలితా సహస్రనామాలు, వేదపారాయణాలు, హోమాలు, గోపూజలు, సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించారు. ప్రత్యేక మండపాల్లో అన్నపూర్ణాదేవి, గాయత్రిదేవి, కూష్మాండదేవి, శ్రీలలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శ్రీకాళికాంబదేవాలయంలో అమ్మవారు శ్రీలలితాదేవి, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో పంచముఖి గాయత్రిదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణదేవి, సంజీవనగర్ రామాలయంలో కూష్మాండదేవిగా, బ్రహ్మనందీశ్వరస్వామి ఆయలంలో గంగా, కామేశ్వరిదేవిలు అన్నపూర్ణదేవి, కూష్మాండదేవిలుగా భక్తులకు దర్శనమిచ్చారు. బొమ్మలసత్రం శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో దుర్గాదేవికి పూజలు చేశారు. బైర్మల్‌వీధిలోని ఆంధ్రా బ్యాంక్ వద్ద దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిన్నాథ్‌సెంటర్‌లో ఏర్పాటు అయిన దుర్గాదేవి అమ్మవారు కాత్యాయినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జగజ్జననీ దేవాలయంలో పెద్ద ఎత్తున రాహుకాల పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఎల్లావత్తులలో ప్రత్యేక వేషాధారణలో చిన్నారులు

ధనలక్ష్మిదేవి దీవించు!

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం వాసవీ వాసవి మాత ధనలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిదేవిగా అలంకరించి మండపంలో కొలువు దీర్చారు.అలాగే ఎల్లావత్తులలో కూడా దసరా ఉత్స వాల్లో భాగంగా అమ్మవారిని కాత్యాయిని దేవిగా అలంకరించారు.ఉత్సవాల్లో భాగంగా ఎల్లావత్తులలో చిన్నారులు ప్రత్యేకంగా అమ్మవారి వేషాధారణలో ఆకట్టుకున్నారు.

జయ జయ హే మహిషాసుర మర్దిని

నంద్యాల(అర్బన్): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మోదుగ (విస్తారుకుల ఆకు)పై దుర్గాదేవి చిత్రాలను గీచారు. చిత్రంలో కాళికాశక్తి, మహిషాసురుడు అనే రాక్షసుడితో యుద్ధం చేస్తూ అతనిని త్రిశూలంతో సంహరిస్తున్నట్లు, భద్రకాళి ఒక రాక్షసుడి తల నరికి చేతిలో పట్టుకొని రౌద్రంగా చూస్తున్నట్లు, అమ్మవారి వాహనమైన సింహం వీరగర్జన చేస్తున్నట్లు, అమ్మవారి రౌద్రరూపం, భీకరమైన యుద్ధం చూసి భూతపిశాచాలు భయంతో పారిపోతున్నట్లు మహిషాసురిడిని వధించిన తర్వాత అమ్మవారు తన శాంతమైన రూపం, చిరునవ్వుతో భక్తులను దీవిస్తున్నట్లు పండుగ ప్రాముఖ్యతను చిత్రంలో ఆవిష్కరించారు.



మోదుగ ఆకుపై దుర్గమ్మ చిత్రం

బాలాత్రిపుర సుందరీ దేవిగా..



ఆళ్లగడ్డ: పట్టణంలోని అమ్మవారిశాలలో కొలువైన శ్రీ మాతా కన్యకా పరమేశ్వరీ దేవీ అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు.

కాత్యాయని దేవీగా..



శిరివెళ్ల: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం కాత్యాయని దేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానాల కార్యక్రమం జరిగింది.

కాత్యాయనిగా చౌడేశ్వరి మాత



ఉయ్యాలవాడ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరిమాత కాత్యాయినీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

పబ్లిక్ టాయిలెట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న మహిళలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్ల వర్కర్ల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడతామని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మురళీధర్, మెడికల్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్లలో పని చేస్తున్న వర్కర్లను శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటూ రూ. లక్షలు గడిస్తున్నారన్నారు. టాయిలెట్ కాంట్రాక్టర్‌ను రద్దు చేసి మున్సిపల్ అధికారులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, లక్ష్మిదేవమ్మ, జయమ్మ, మద్దమ్మ, సుజాత, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఎంజే జ్యువెలరీ షాపులో ఆభరణాలు మాయం

- మూడు రోజులుగా ఉద్యోగులను విచారిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నంద్యాల: పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న పీఎంజే జ్యువెలరీ షాపులో 5 కేజీల బంగారు ఆభరణాలు మాయమైనట్లు సమాచారం. సంవత్సరానికి ఒక సారి జరిగే ఆడిట్‌లో భాగంగా కంపెనీ ప్రతినిధులు ఆడిట్ నిర్వహించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇందులో పని చేసే మేనేజర్, కొంత మంది ఉద్యోగుల సహకారంతో విడతల వారీగా బంగారాన్ని షాప్ నుంచి బయటకు పంపించినట్లు పీఎంజే కంపెనీ ప్రతినిధులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా పీఎంజే జ్యువెలరీ షాపు ఉద్యోగులను షాపులో ఉంచి బయట షట్టర్లు వేసి విచారిస్తున్నారు. గురువారం రాత్రి పీఎంజే కంపెనీలో పని చేసే మేనేజర్ తండ్రి శ్రీనివాసరెడ్డి, తల్లి జ్యువెలరీ షాపు ముందు ఆందోళనకు దిగారు. తన కుమారుడిని, అందులో పని చేసే ఉద్యోగులను మూడు రోజులుగా చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. విషయాన్ని టూటౌన్ పోలీసులకు తెలిపామని, వారు కూడా వచ్చి వెళ్లారన్నారు. ఈ విషయంపై టూటౌన్ సీఐ అస్రార్‌బాషాను వివరణ కోరగా.. పీఎంజే జ్యువెలరీ షాపు యజమానులు ఫిర్యాదు చేయలేదని, అయితే తాము అక్కడికి వెళ్లి వివరాలు తెలుసుకోగా ఉద్యోగుల సమక్షంలో మూడు రోజులుగా ఆడిట్ నిర్వహిస్తున్నామని, ఏమైనా ఉంటే ఆడిట్ అనంతరం ఫిర్యాదు చేస్తామన్నారు.


అలరించిన కవి సమ్మేళనం



కవులను సన్మానించిన ముస్లిం రచయితల సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక నవభారత్ హైస్కూల్‌లో తెలుగు, ఉర్దూ, హిందీ భాషల్లో నిర్వహించిన కవి సమ్మేళనం ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మహమ్మద్ రఫీ, అబ్దుల్‌సమ్మద్ మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై, ఆశయాలను, మంచి సమాజం కోసం ఆయన బోధనలు అందరూ తప్పక పాటించాలన్నారు. అనంతరం 20 మంది కవులను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్‌కరీం, కవులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న రూ.2వేల కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయకపోతే ఆందోళనలు చేపడతామని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ నిబంధనలకు వర్తించే ప్రతి చికిత్సకు ఆరోగ్యశ్రీ నుంచి అప్రూవల్ వచ్చిన తర్వాత యాజమాన్యాలు చికిత్స చేయించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ నిధులు లేక ప్రైవేటు యాజమాన్యాలు చికిత్సలు చేయడం లేదని అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆరోగ్యశ్రీని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే స్పందించి ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేసి పేద ప్రజల వైద్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



హాస్టల్ ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్

నంద్యాల: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల పట్టణం దేవనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ (ఎస్సీ) బాలుర వసతి గృహం-1లో 'ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్' స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రమదానంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం-2025లో భాగంగా జిల్లా వ్యాప్తంగా శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వసతి గృహ ప్రాంగణాన్ని శుభ్రపరచి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించామన్నారు. జిల్లాలో సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, మైనారిటీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్ కలిపి మొత్తం 108 ఉన్నాయని, వీటన్నిటిలో కూడా ఇలాంటి శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం వసతి గృహంలోని గదులను శుభ్రం చేయడం, వంట పాత్రలు, రేషన్ సరుకులు, టాయిలెట్లను పరిశీలించి ముమ్మర పారిశుద్ధ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు సిబ్బందితో పరిశుభ్రం చేయించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చింతామణి, వసతి గృహ వార్డెన్లు, మున్సిపల్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): రాయమాల్పురంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్మికులు ఇవ్వాలన్నారు. స్వచ్ఛ గ్రామా లుగా తీర్చేదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు.

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, సర్పంచ్ అయ్యలూరి సుభహాన్, ఎంపీటీసీ సభ్యుడు కమతం జయరామిరెడ్డి, సొసైటీ చైర్మన్ తపతి శ్రీరాములు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది సచ్ఛతాహీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిసరాల శుభ్రతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

రుద్రవరం:స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఎంపీడీఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు శ్రమదానం చేశారు.

డోర్నిపాడు: పరిసరాల పరిశుభ్రతతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ సూచించారు. గురువారం సచివాలయ ఉద్యోగులతో కలిసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టల్లోనే వేయాలన్నారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులకు సులభంగా ఉంటుందన్నారు. అలాగే వ్యర్థాల నుంచి సంపద సృష్టించడంతో పాటు తద్వారా మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందన్నారు.

కష్టపడే తత్వం అలవర్చుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చిన్నతనం నుండే కష్టపడే తత్వం అలవర్చుకోవాలని డాక్టర్ మధుసూదన్ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి ఎన్‌సీసీ కార్యక్రమంలో భాగంగా ఈఎన్‌టీ డాక్టర్ మధుసూదన్ కేడెట్స్‌కు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎన్నో అంశాలను ఎన్‌సీసీ కేడెట్స్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 400 మంది కేడెట్స్ అహోబిలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం అభినందనీయమన్నారు. బీహార్, జార్ఖండ్, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం నుంచి వచ్చిన ఎన్‌సీసీ కేడెట్లకు అహోబిలం పుణ్యక్షేత్రం గురించి, స్థల పురాణం చరిత్రను అక్కడ ఉన్న స్థానికుల ద్వారా తెలుసుకొని ఉత్తేజం పొందారన్నారు. అనంతరం డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులందరూ ఇలాంటి ప్రదేశాలు సందర్శించడంతో ఎన్నో విషయాలు నేర్చుకుంటారన్నారు. దేశం పట్ల గౌరవం, క్రమశిక్షణ, సమయపాలన, అంకిత భావం, వంటి ఎన్నో విషయాలు లక్షణాలు వస్తాయన్నారు. మహానంది రోడ్డులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమంలో వంద మంది ఎన్‌సీసీ కేడెట్లు అక్కడ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లలితాసరస్వతి, పావని, భువనచంద్ర, సురేష్, గురు, శివకుమార్, మున్సిపల్ ఇంజనీర్ నాగభూషణంరెడ్డి, మురళీధర్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు

జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన కల్పించండి

నంద్యాల: జిల్లాలో జీఎస్‌టీ 2.0 (సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్) సంస్కరణలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో హాలులో మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 22వ తేదీ నుండి అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంత మేర లాభం చేకూరుస్తున్నాయో తెలియజేయడం కోసం సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రముఖ కూడళ్ల వద్ద, మండల స్థాయిలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. జీఎస్టీ పురోగతి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జీఎస్టీ 2.0 (సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్) సంస్కరణలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కమీషనర్ మురళీ మనోహర్, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్లు (నంద్యాల డివిజన్) లక్ష్మీనాయక్, హర్ష చందన, డిప్యూటీ సహాయ కమీషనర్లు భువనేశ్వరి, సునీత రెడ్డి, సుదర్శన్, వాణిజ్య పన్నుల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3న బంద్‌ను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 3వ తేదీన నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని ముస్లిం జేఏసీ నాయకులు కోరారు. స్థానిక డబరాల మసీదులో గురువారం బంద్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముస్లిం జేఏసీ నాయకుడు అబ్దుల్లా రషాదీ, ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు షంషుల్ ఉలామా ముస్లిం జేఏసీ అధ్యక్షుడు అబులైజ్‌లు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని బలవంతంగా అమలు చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. సుప్రీం కోర్టు వక్ఫ్ సవరణ చట్టంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని, కొన్ని నిబంధనలపై మాత్రమే స్టే ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులతో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సంతృప్తిగా లేదని అన్నారు. ఇందుకు గాను ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వక్ఫ్ బచావో ఆందోళన కార్యక్రమంలో భాగంగా 3వ తేదీన భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులు, కార్యాలయాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఏకేఖాన్, ఎజాజ్ హుసేన్, అర్షద్ బాషా, అన్సర్‌బాషా, జాకీర్‌హుసేన్, సమీవుల్లాఖాన్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు బోర్డులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపు బోర్డులను దుకాణాల ఎదుట ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నాల సాయిరాంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కొత్త జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చి ఐదు రోజులు అయినప్పటికీ నిత్యావసర, మందులు, సిమెంట్ వంట నూనెలు, ఇవి కాక 400 వస్తువులపై జీఎస్టీ తగ్గిందని, కాని ఇంకా పాత రేట్లకే విక్రయిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బోర్డులను దుకాణాల ఎదుట ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో శ్రీరాములు, బాషా, తదితరులు పాల్గొన్నారు.